పంటలు నీటిపాలు

- దెబ్బతిన్న మినుము, మొక్కజొన్న, కంది
- దిగాలు చెందుతున్న రైతులు
- ఉద్యాన పంటలకు అపారనష్టం
- ఏడాది పొడవునా ఇదే దుస్థితి..



పెద్దేముల్ మండలం ఇందూరులో భారీ వర్షాలకు నీట మునిగిన మినుము

పెద్దేముల్: వర్షా కాలానికి ముందు వానల కోసం ఆకాశం వైపు దీనంగా చూసిన రైతులకు.. ప్రస్తుత కుండపోత వర్షాలకు కంటిమీద కునుకులేకుండా పోయింది. మునుపెన్నడూ లేని విధంగా పది రోజులకు పైగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు ఎదిగిన, ఎదుగుతున్న పంటలు నీటమునగడంతో కన్నీటి పర్యంతం అవుతున్నారు. చేతికి వచ్చిన మినుము, పెసర పంటలు ఎర్ర బారి, మురిగిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు నాటే సమయంలో వానలు పడక నాడు ఇబ్బంది పడ్డామని, తీరా పంటలు చేతికి వచ్చే సమయంలో అధిక వర్షాలతో మినుము, పెసర పంటలు నీటి పాలయ్యాయని పెద్దేముల్‌తండా, మారేపల్లి, నాగులపల్లి రైతులు రోధిస్తున్నారు. ప్రస్తుత వర్షాలతో కలుపు తీయడం కష్టమేనని, ఏకధాటి వర్షాలతో పత్తి, కంది మొక్కలు ఎదగటం కష్టమేనని కర్షకులు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. మండలంలోని 30 రెవెన్యూ గ్రామాల్లో నూటికి నూరు శాతం రైతులు వ్యవసాయంపై ఆధార పడి ఉండటం గమనార్హం.

సాగు వివరాలు

పెద్దేముల్ మండలంలో పత్తి–14వేల ఎకరాలు, కంది–12,500, సోయ–210, మొక్కజొన్న–190, మినుము–1,110, పెసర–970, తెల్లజొన్న–120 ఎకరాల్లో అన్నదాతలు సాగుచేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

జాడలేని వ్యవసాయ అధికారులు

అధిక వర్షాలతో పంటలు పాడవుతున్నా వ్యవసాయ అధికారులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. పంటల నమోదుపై చూపిస్తున్న శ్రద్ధ.. నీట మునిగి పంటలు పాడైతే ఇటు తొంగి చూడటం లేదని విమర్శిస్తున్నారు.

కూరగాయ రైతులు కుదేలు



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో కుళ్లిపోయిన క్యాబేజీ

మోమిన్‌పేట: ఏకధాటి వర్షాలతో కూరగాయల రైతులకు అపార నష్టం వాటిల్లింది. మార్చి, ఏప్రిల్ నెలలో కురిసిన అకాల వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతోనే టమాట, మిరపకాయ, బీరకాయ, కాకరకాయ తదితర కూరగాయలు ధరలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం క్యాబేజీ, కాలీఫ్లవర్, బెండ తదితర పంటలు వర్షార్పణం అయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడులు దక్కలేదని వాపోతున్నారు. మార్చి నుంచి కూరగాయల రైతులు నష్టాలను చవిచూస్తేనే ఉన్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. అకాల వర్షాలకు దెబ్బతిన్న కూరగాయ పంటలకు ఎకరాకు రూ.10వేల పరిహారం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. నెటికీ రూపాయి కూడా ఇవ్వలేదని చెప్పారు. పరిహారం చెల్లిస్తే.. కొంతైనా ఆసరా అవుతుందని అనుకున్నామని, చివరకు ఏమీ ఇవ్వలేదన్నారు. మే నెలలో సాగు చేసిన కూరగాయల పంటలు చేతికి వచ్చే సమయంలో భారీ వర్షాలతో నీటి పాలయ్యాయని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఐదేళ్లుగా ఎంపీ కనబడట్లేదు!

పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నేతల ఫిర్యాదు



ఎస్‌ఐ శ్రీశైలంకు ఫిర్యాదు అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: ఎన్నికల ప్రచార సమయంలో వచ్చిన ఎంపీ రంజిత్ రెడ్డి.. ఐదేళ్లు కావస్తున్నా.. కుల్కచర్ల మండలానికి ఒక్కసారి కూడా రాలేదని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఎంపీ కనిపించడం లేదంటూ స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్.. ఎన్నికలు అయ్యాక కుర్చీ వేసుకొని కూర్చొని పరిగిని అభివృద్ధి చేస్తానని చెప్పారని, కానీ ఆయన కూడా ఒక్కసారి రాలేదని విమర్శించారు. అదే రీతిలో ఎంపీ రంజిత్‌రెడ్డి సైతం ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని ముఖం చాటేశారని మండిపడ్డారు.

త్వరలో దిష్టిబొమ్మల దహనం

ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు.. ప్రజా సంక్షేమం మరచిపోయారని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. ప్రజల చెంతకురాని ప్రజాప్రతినిధులకు, ప్రజలు తగిన సమయంలో తగినవిధంగా బుద్ధి చెబుతారన్నారు. కుల్కచర్ల ప్రజల ఓట్లతో గెలిచిన నేతలు మండలానికి రానిపక్షంలో త్వరలోనే వారి దిష్టిబొమ్మలను దహనం చేసే కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాస్, హన్మంతు, షర్పొద్దీన్, రోహిన్, వెంకటేశ్, ఆనందం, భరత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

దోమ: దోమ మండలం ఐనాపూర్‌లో విద్యుత్ షాక్‌తో శనివారం మృతి చెందిన బాలరాజ్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి పరామర్శించారు. అనంతరం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, సర్పంచ్ మల్లేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రుక్మయ్య, సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, బీమయ్య, సాయిలు, చంద్రయ్య, రాములు, యూసుఫ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కుమ్మరి వెంకటేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటికే పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ జిల్లా నేత, కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి శనివారం స్థానిక నేతలతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఎస్సీమోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, బీజేవైఎం మండల అధ్యక్షుడు శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాంపూర్‌లో కూలిన ఇల్లు



కూలిన ఇల్లు

షాబాద్: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు షాబాద్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన కటికే సందీప్ ఇల్లు శుక్రవారం రాత్రి కూలిపోయింది. ఇప్పటివరకు మండలంలో 8 ఇళ్లు కూలిపోయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ పాండుగౌడ్



వృద్ధులతో పాండుగౌడ్, వైద్య సిబ్బంది

మొయినాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, వయోవృద్ధులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ లక్ష్యమని మాజీ ఎంపీపీ, సొసైటీ వైస్‌చైర్మన్ పాండుగౌడ్ అన్నారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా సర్పంచ్ సస్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురుకి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పాండుగౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు అనురాగ్, శ్రీశైలేష్‌బాబు, చరిత్ర, ఉపసర్పంచ్ శిరీష, వార్డుసభ్యులు చంద్రయ్య, యాదయ్య, మేస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆశాకార్యకర్తలు లావణ్య, శ్యామల పాల్గొన్నారు.

48 గంటల్లో పరిష్కరిస్తాం

పారిశుద్ధ్య నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాం



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మునిసిపాలిటీలో పారిశుద్ధ్యం పడకేసింది! మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి.. మురుగు జలాలు ముందుకు సాగని దుస్థితి. పలు కాలనీల్లో వరద నీరు చేరి బురదగా మారగా.. చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. అసలే వ్యాధులు ప్రబలే కాలం. ఆపై ఇలా లోపించిన పారిశుద్ధ్యం పుర ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న నేపథ్యంలో కమిషనర్ జాకీర్ హైమద్‌తో 'సాక్షి' ముఖాముఖి.

- వర్షాలు తగ్గిన తర్వాతే రోడ్ల మరమ్మతు
- మునిసిపల్ కమిషనర్ జాకీర్ హైమద్

వికారాబాద్ అర్బన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తాయి. దీని పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టారు.

కమిషనర్: భారీ వర్షంలోనూ మా కార్మికులు పనిచేశారు. అధిక వర్షంతో కొన్ని చోట్ల మురుగు కాలువల్లో చెత్త చేరి, నీరు ముందుకు సాగలేదు. 48 గంటల్లో ఆ సమస్యను పరిష్కరిస్తాం. రెండు మూడు రోజుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నాం.

ప్రశ్న: బీజేఆర్ చౌరస్తాలో డ్రైనేజీ లీకేజీతో తరచూ సమస్య వస్తోంది. అది మీ దృష్టికి వచ్చిందా?

జ: అవును. వారం రోజుల క్రితమే పరిశీలించాను. ఆర్అండ్‌బీ వాళ్ల నుంచి క్లియరెన్స్ తీసుకున్నాం. మూడు రోజుల్లోగా ఆ సమస్య లేకుండా చేస్తాం.

ప్రశ్న: 17వ వార్డు మధు కాలనీలో రోడ్లు అధ్వానంగా మారి, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మీ పరిశీలనలో ఉందా?

జ: శుక్రవారమే ఆ కాలనీకి వెళ్లి తనిఖీ చేశాం. అక్కడ కచ్చ లే-అవుట్లు ఉండటంతో మట్టి రోడ్లు వేశారు. వర్షాలకు రోడ్లన్నీ బురదగా మారి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అక్కడ ఇప్పటికిప్పుడు ఏమి చేయలేం. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత కనీసం బ్లాక్ చిప్స్ వేసి కొంత సమస్యను తీరుస్తాం.

ప్రశ్న: 20వ వార్డు రాజీవ్ గృహకల్ప ఇళ్ల చుట్టూ నీరు నిల్చింది. అక్కడ పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. దీనిపై మీరు ఏమంటారు?

జ: నేను కమిషనర్ బాధ్యతలు చేపట్టి 15 రోజులే అవుతోంది. ఇంకా పూర్తి స్థాయిలో అన్ని వార్డులకు వెళ్లలేదు. గృహకల్పలో నీరు నిలిచినట్లు సమాచారం ఉంది. ఆ సమస్య మరలా తలెత్తకుండా చర్యలు తీసుకొమ్మని మా సిబ్బందికి చెప్పాను.

ప్రశ్న: 7వ వార్డు గుడుపల్లి, 8 వార్డు మద్గుల్ చిట్టంపల్లిలో మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అసలే సీజనల్ వ్యాధుల కాలం.

జ: అక్కడికి శుక్రవారం రోజున వెళ్లాను. ఆ వార్డుల్లో ఎరుకల కుటుంబాలు అధికంగా ఉండటంతో.. అక్కడ అధిక సంఖ్యలో పందుల గుంపులు ఉన్నాయి. అందుకే మురుగు కాలువల సమస్య తీవ్రంగా ఉంది. త్వరలో ఎరుకలను పిలిచి మాట్లాడి ఆ సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న: 25వ వార్డు శుభాష్ నగర్‌లో పెద్ద మురుగు కాలువలో నీరు ఆగిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

జ: కూరగాయల బీట్ల మార్కెట్ వద్ద ఈ మురుగు కాలువను పరిశీలించాం. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి సమస్య పరిష్కరిస్తాం.

ప్రశ్న: మున్సిపాలిటీలో ఎంత మంది కార్మికులు పనిచేస్తున్నారు?

జ: ఐదు మంది జవాన్లు, ఒక ఇన్‌స్పెక్టర్, 201 మంది అన్ని విభాగాల సిబ్బంది పనిచేస్తున్నారు. శానిటేషన్ సమస్యపై వెంటనే స్పందించి పనిచేయిస్తున్నాం.

బహుజనుల బంధువు 'సాయన్న'

- ఆయన జీవితం అందరికీ ఆదర్శం
- 'పండుగల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి
- మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, ముదిరాజ్ సంఘం నేతలు



పరిగి: సాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్‌లు

పరిగి: పేదల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి పండుగల సాయన్న అని, ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సామాజిక విప్లవకారుడు సాయన్న జయంతి సందర్భంగా శనివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి, బహుజన బంధువుగా సాయన్న పేరుపొందారని, సంపన్నులను దోచి.. పేదలకు పంచిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన నాయకుడని, ఆయన జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు రాంచంద్రయ్య, నాయకులు మాణిక్యం, అనంతయ్య, ముకుంద నాగేశ్వర్, వెంకట్‌రాములు, జనార్దన్, మైపాల్ పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: ధనికుల అరాచకాలను అడ్డుకొని, పీడిత వర్గాలకు ధన, ధాన్యం సహాయం చేసి, పేదల అభ్యున్నతికి పాటుపడిన గొప్ప వ్యక్తి పండుగ సాయన్న అని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం, చౌడాపూర్ మండల సంఘం అధ్యక్షుడు కృష్ణ అన్నారు. సాయన్న జయంతి సందర్భంగా ప్రధాన కూడలిలో ఆయన చిత్రపటానికి ముదిరాజ్‌లు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాటనిపల్లి అంజిలయ్య, బీఎస్ ఆంజనేయులు, మైపాల్, వెంకటయ్య, నర్సింహులు, మాసయ్య, కళ్యాణ్, శ్రీశైలం, భగత్‌కుమార్, బురకొండ సత్యయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

3న మంద కృష్ణ మాదిగ రాక

తాండూరు టౌన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆగస్టు 3న తాండూరుకు రానున్నారని సమితి జిల్లా కన్వీనర్ మల్లికార్జున్ మాదిగ చెప్పారు. శనివారం ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై మాదిగలను అన్ని పార్టీలు మోసం చేస్తూనే ఉన్నాయని ఆరోపించారు. అందులో భాగంగానే ఆగస్టు రెండో వారంలో మాదిగల విశ్వరూప మహాసభ పేరుతో హైదరాబాద్‌లో సభ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ముందుగా 3న సన్నాహక సదస్సు నిర్వహించేందుకు కృష్ణమాదిగ రానున్నట్లు తెలిపారు. కావున మాదిగలందరూ ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ, స్వామిదాస్, మహేందర్, ప్రకాష్, చంద్రప్ప, బలరామ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

తాండూరు రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారానికి 24వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు పడుకొని వినూత్న నిరసన తెలిపారు. సమ్మెకు మద్దతు తెలుపుతూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. కార్మికుల న్యాయమైన కోరికలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

బంట్వారం: సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణరెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్.. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆరోగ్యం జాగ్రత్త



వైద్య పరీక్షలు చేస్తున్న విమలాదేవి

మోమిన్‌పేట: ఆరోగ్యం పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని హెల్త్ అసిస్టెంట్ విమలాదేవి అన్నారు. శనివారం మోమిన్‌పేట మండలం చంద్రాయన్‌పల్లిలో ఏర్పాటు ఆరోగ్య శిబిరంలో ఆమె మాట్లాడారు. వర్షా కాలంలో ఎప్పటికప్పుడు వేడి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె పేర్కొన్నారు. జలుబు, జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించాలని చెప్పారు.

ఎస్ఐ వీరబ్రహ్మంకు సన్మానం



ఎస్ఐ వీరబ్రహ్మంను సన్మానిస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు

చేవెళ్ల: ఇటీవల చేవెళ్ల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వీరబ్రహ్మంను చేవెళ్ల బ్రహ్మగిరి క్షేత్రం విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లింగచారి, మాణిక్యచారి, బాలస్వామి, శ్రీనివాస్, శంభులింగం, సత్యనారాయణ, రాఘవేంద్రచారి, విష్ణు, అక్షయ్‌చారి పాల్గొన్నారు. అనంతరం బీజేపీ నాయకులు ఎస్ఐ వీరబ్రహంను కలిసి శాలువతో సన్మానించారు. ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్, నాయకులు రింజత్, శ్రీనివాస్, మాహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ గూటికి లక్ష్మారెడ్డి



పార్టీ అగ్రనేతల సమక్షంలో బీజేపీలో చేరుతున్న లక్ష్మారెడ్డి

తాండూరు: డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి బీజేపీలో చేరారు. శనివారం దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర మంత్రి ప్రకాశ్‌జవదేకర్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు పలువురు రాష్ట్ర నేతల సమక్షంలో కాషాయ కండువా కప్పుకొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రమేష్‌కుమార్‌లు ఉన్నారు.

సవార్ల సంబురం

భక్తిశ్రద్ధలతో మొహర్రం



మోమిన్‌పేట: ఏన్కతలలో

త్యాగాలకు ప్రతీకగా, కులమతాలకు అతీతంగా హిందూ ముస్లింలు కలిసికట్టుగా జరుపుకొనే మొహర్రం జిల్లాలో ఘనంగా జరిగింది. ఆఖరి రోజైన శనివారం కావడంతో దప్పు చప్పుళ్లతో వీధుల్లో పీర్లను ఊరేగించగా.. భక్తులు కానుకలు చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పీర్ల చావిడి వద్ద మహిళలు బొడ్డెమ్మ, యువత అలం ఆడుతూ ధూంధాం చేశారు. అనంతరం సవార్లను నిమజ్జనం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



బొంరాస్‌పేట: చావిడి ఎదుట ఆటలాడుతున్న మహిళలు



శివారెడ్డిపేటలో ఎమ్మెల్యే ఆనంద్



పెద్దేముల్: రేగొండిలో..



కొడంగల్‌లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



కొడంగల్ రూరల్: హస్నాబాద్‌లో..



ధారూరు: కొండాపూర్‌కలాన్‌లో పీరికి మొక్కుతున్న మహిళ



దోమ: ఐనాపూర్‌లో..



కుల్కచర్లలో..



పూడూరు: చెన్‌గోముల్‌లో..



పరిగిలో..